
సాక్షి
తూర్పుగోదావరి
బుధవారం | 10 | ఏప్రిల్ | 2024



డెల్టాలకు నీటి విడుదల
ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 1,800, మధ్య డెల్టాకు 1,300, పశ్చిమ డెల్టాకు 3,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.



రూ.1,01,116 విరాళం
అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి మానేపల్లి సూర్యనారాయణ, దుర్గాలక్ష్మి దంపతులు (రామచంద్రపురం) మంగళవారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



న్యూస్‌రీల్

పార్టీలో రచ్చ.. పవన్‌కేమో పచ్చడి



పవన్‌కు ఉగాది పచ్చడి తినిపిస్తున్న టీడీపీ నేత వర్మ

పిఠాపురం: 'జనసేన ఊసెత్తకూడదు. ఆ పార్టీ జెండా పట్టకూడదు. ఆ పార్టీ వారెవ్వరినీ కలవకూడదు'– పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తన పార్టీ నేతలకు రోజూ ఇస్తున్న ఆదేశాలివి. ఆయన మాటలు నమ్మి పొత్తు ధర్మాన్ని సైతం పక్కన పెట్టి జనసేనకు దూరంగా ఉంటున్నారు నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు. కానీ, వర్మ మాత్రం కుటుంబ సమేతంగా.. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో జనసేన అధినేత పవన్ కల్యాణ్ నిర్వహించిన ఉగాది వేడుకలకు హాజరయ్యారు. అంతే కాదు.. ఆయనకు స్వయంగా ఉగాది పచ్చడి తినిపించారు. ఆయన అనుసరిస్తున్న ఈ ద్వంద్వ వైఖరి రెండు పార్టీల నాయకులను అయోమయానికి గురి చేసింది. ఒక వైపు జనసేన కమిటీల్లో టీడీపీ నుంచి వెళ్లిన వారు ఉండకూడదంటూ రచ్చ చేసి, పవన్‌కు మాత్రం ఉగాది పచ్చడి తినిపిస్తారా? ఇదేం చోద్యం అంటూ వర్మ తీరుపై ఇరు పార్టీల నేతలు ముక్కున వేలేసుకుంటున్నారు.

కొబ్బరికి మద్దతు ధర



కొబ్బరి ముక్కుడు కాయలు

అంబాజీపేట: సంక్షోభంలో ఉన్న కొబ్బరి రైతులను ఆదుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం కొబ్బరి కాయలకు మద్దతు ధర ప్రకటించింది. రైతుల వద్ద నుంచి పరిణితి చెందిన కొబ్బరి (ముక్కుడు) కాయలకు, పిలక కాయలకు (డిహస్క్‌డ్ కోకోనట్స్), బోడకాయలను (గుండ్రంగా ఉండేవి) క్వింటాల్‌కు రూ.3,013 వంతున ప్రకటించింది. ఈ మేరకు భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి అజిత్ కుమార్‌సింగ్ జీవో జారీ చేసినట్లు సమాచారం. ఈ కొనుగోలు బాధ్యతను నాఫెడ్ నేషనల్ కో ఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్ (ఎన్.సి.సి.ఎఫ్)కు అప్పగించినట్లు తెలిసింది. ఈ రెండు సంస్థలు కేంద్ర ఏజెన్సీలుగా కొనసాగుతూ రైతుల వద్ద నుంచి ఒలిచిన ముక్కుడు కొబ్బరికాయలను నేరుగా కొనుగోలు చేస్తాయి. ఇలా కొనుగోలు చేసిన కొబ్బరికాయలను ఎఫ్.పి.ఓ.(ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్)లకు విక్రయించి, అక్కడ కోప్రా తయారు చేయించి వారి నుంచి ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. దీనివల్ల రైతులకు కొబ్బరి తయారు చేయడం నుంచి వెసులుబాటు కలుగనుంది.

కొబ్బరి కాయల విక్రయం రైతులకు లాభమేనా...

కొబ్బరి ధరలు గణనీయంగా తగ్గినప్పుడు కేంద్ర ప్రభుత్వం నాఫెడ్, ఆయిల్‌ఫెడ్‌ల ద్వారా రైతుల వద్ద నుంచి తయారు చేసిన కొబ్బరిని(కోప్రా)ను క్వింటాల్ రూ.11,160 వంతున కొనుగోలు చేస్తుంది. అయితే ఎక్కువ మంది రైతులు సన్న, చిన్న కారులతో పాటు, కౌలు రైతులు ఉండటంతో వీరందరూ కొబ్బరిని తయారు చేసే పరిస్థితిలో లేరు. ఇందుకు నిర్వహణా వ్యయం ఎక్కువ కావడంతో పాటు కొబ్బరి దిగుబడులు వేయి కాయలకు 80 కేజీలు మాత్రమే లభిస్తుండడంతో రైతులు నేరుగా కొబ్బరికాయలను కొనాలని డిమాండ్ చేస్తున్నారు.

భక్తులతో పోటెత్తిన విఘ్నేశ్వరుని ఆలయం



స్వామివారి దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు

అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయం క్రోధి నామసంవత్సర ఉగాది సందర్భంగా భక్తులతో కిక్కిరిసింది. స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయాన్ని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఆలయంలో పుష్పాలతో ఏర్పాటు చేసిన సెట్ భక్తులను ఆకట్టుకుంది. అక్కడ సెల్ఫీల కోసం భక్తులు ఎగబడ్డారు. స్వామి సన్నిధిలో వేదపండితులు ఈమని భాస్కర సోమయాజుల శర్మ, కప్పగంతులు సూర్యనారాయణమూర్తి పంచాంగ పఠనం చేశారు. స్వామివారి దర్శనం కోసం విచ్చేసిన భక్తులకు ఆలయ సిబ్బంది ఉగాది పచ్చడి, పంచాంగాలను పంపిణీ చేశారు.



చిన్న గుళిక.. చింత లేదిక..

- సరళం.. హోమియో వైద్యం
- పలు రోగాలకు శాశ్వత ఉపశమనం
- ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ
- నేడు ప్రపంచ హోమియో దినోత్సవం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఎంతటి దీర్ఘ కాలిక రోగాన్నయినా చిన్నచిన్న తీయని గుళికలతో దారిలోకి తెస్తుంది.. మామూలుగా కొన్ని రకాల ఇంగ్లిషు మందులు వాడితే ఆరోగ్యంపై రకరకాల దుష్ప్రభావాలు ఉంటాయి. కానీ, ఈ చిన్నచిన్న గుళికలు ఎటువంటి దుష్ప్రభావం లేకుండానే చాలా వరకూ రోగాలను దూరం చేస్తాయి. పేదల నుంచి పెద్ద వర్గాల వరకూ ప్రజల్లో ఎంతో ఆదరణ పొందిన ఈ వైద్య విధానమే హోమియోపతి. దీనిని చిన్నారుల నుంచి పెద్దల వరకూ అందరూ ఇష్టపడతారు. ఎన్నో విషజ్వరాలకు, అంతు చిక్కని రోగాలకు ఈ వైద్య విధానంలో మంచి మందులు లభిస్తున్నాయి. ఇటువంటి వైద్య విధానాన్ని ప్రజలకు అందించిన హోమియో పితామహుడు క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ శామ్యూల్ హానిమన్ జయంతి నేడు. దీనిని ప్రపంచ హోమియో దినోత్సవంగా జరుపుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో రోగులకు సంజీవినిలా..

ఎక్కువ గ్రామీణ ప్రాంతాలు, అటవీ ప్రాంతాలుగా విస్తరించి ఉన్న ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో దోమల వల్ల వ్యాప్తి చెందే కలరా, మెదడు వాపు, స్పైన్ ఫ్లూ, చికున్‌గన్యా వంటి వ్యాధులకు హోమియో వైద్యంతో అడ్డుకట్ట పడుతోంది. దీంతో ఈ వైద్యానికి ఎంతో ఆదరణ లభిస్తోంది. దీనికి తగినట్టుగానే జిల్లాలో హోమియో ఆసుపత్రులు అనేకం పెరిగాయి. ఇటీవల ప్రపంచం అంతటినీ అల్లకల్లోలం చేసిన కరోనా (కోవిడ్–19) మహమ్మారికి కూడా ఈ వైద్య విధానం కట్టడి చేసిందని హోమియో నిపుణులు చెబుతారు. వివిధ వ్యాధులు రాకుండా ముందుగానే నివారించే మందులను ఈ వైద్య విధానం అందించడం సత్ఫలితాలనిస్తోంది.

రాజమహేంద్రవరంలో హోమియో కళాశాల

హోమియో వైద్యులను తీర్చిదిద్దేందుకు రాజమహేంద్రవరంలోని డాక్టర్ అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియోపతి వైద్య కళాశాలను 1969లో స్థాపించారు. ఈ కళాశాల, ఆసుపత్రిలో నిష్ణాతులైన వైద్యులు, వైద్య విద్యను బోధించే అధ్యాపకుల ద్వారా ఏటా 50 మంది హోమియో వైద్యం పట్టా పొంది, ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ఈ హోమియో కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రిలో ప్రతి నెలా 3 వేల మంది రోగులు వివిధ రోగాలకు చికిత్స పొందుతున్నారు. వారితో పాటు వేలాది మంది వైద్య సలహాలు పొందుతూ, హోమియో విధానాన్ని అనుసరిస్తున్నారు. వైద్యులను సంప్రదించడం నుంచి మందులు అందించడం వరకూ ఈ ఆసుపత్రిలో అంతా ఉచితమే కావడం విశేషం. అలాగే, అవసరమైనవారికి ఇన్ పేషెంట్లుగా కూడా చికిత్స అందించేందుకు ఇక్కడ ప్రత్యేక విభాగాలు ఉన్నాయి. 'ఇన్ పేషెంట్ వార్డ్ (ఐపీ వార్డ్), స్త్రీ, పురుషులకు, పిల్లలకు ప్రత్యేక విభాగాలు అందుబాటులో ఉన్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉంటారు.




రాజమహేంద్రవరంలోని అల్లు రామలింగయ్య హోమియో కళాశాల, ఆసుపత్రి

అపోహలు.. వాస్తవాలు

- ఇప్పటికే 50 శాతం మంది అనుసరిస్తున్న ఈ వైద్య విధానం 100 శాతానికి చేరకపోవడానికి ప్రజల్లో ఉన్న కొన్ని అపోహలే కారణమని హోమియో వైద్య నిపుణులు చెబుతున్నారు.
- హోమియో వైద్యం రోగాన్ని ఎక్కువ చేస్తుందనేది అవాస్తవం. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే ఎంచుకున్న మందును ఎక్కువ మోతాదులో వాడితే రోగ లక్షణాలు ఎక్కువగా కనిపించే అవకాశం ఉంటుంది. మందుల పొటెన్సీ తగ్గిస్తే ఉపశమనం వచ్చేస్తుంది.
- ఇతర అల్లోపతి మందులు వాడేటపుడు హోమియో మందులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించరాదనేది తప్పుడు అవగాహనే.
- అధిక రక్తపోటు, థైరాయిడ్, షుగర్ వ్యాధిగ్రస్తులు ఇతర వైద్య విధానాల్లో మందులు వాడుతున్నా హోమియో కూడా వాడవచ్చు. వ్యాధి తీవ్రత తగ్గుతున్నపుడు ఆ మందుల వాడకం తగ్గించి, హోమియో వాడితే ఆరోగ్యం మరింత బావుంటుంది.
- హోమియో మందులు వేడి చేస్తాయని, వేసవిలో వాడకూడదని అంటూంటారు. వాస్తవానికి ఈ మందులు శరీరంలో ఎటువంటి వేడినీ కలిగించవు. ఎలాంటి వాతావరణంలోనైనా వీటిని వాడవచ్చు.
- అన్ని జబ్బులకూ ఒకేలాంటి మందులు ఇస్తారని అనుకుంటారు కానీ హోమియో పిల్స్ చూడటానికి ఒకేలా ఉన్నా వాటిలో కలిపే మందులు, పొటెన్సీ వేర్వేరుగా వ్యాధి నివారణకు తగినట్టుగా తయారు చేస్తారు.
- వ్యాధి లక్షణాలను బట్టి మాత్రమే పత్యం సూచిస్తారు.

హోమియో పుట్టుక ఇలా..



పెద్దగా వైద్య సదుపాయాలు లేని ఆ రోజుల్లో అనారోగ్య సమస్య వస్తే నాటు వైద్యం పైనే ఆధారపడే వారు. ఆ సమయంలో అల్లోపతి వైద్యం ప్రజలకు పరిచయమైంది. స్వతహాగా డాక్టర్ హానిమన్ అల్లోపతి వైద్యుడు. ఆ కాలంలో అవలంబించే కొన్ని వైద్య విధానాల వలన రోగి మరింతగా ఇబ్బంది పడటాన్ని గమనించి, పరిష్కారం కోసం ఆలోచించారు. అదే సమయమలో 'మెటీరియా మెడికా' అనే గ్రంథాన్ని అనువదిస్తూ, మలేరియా జ్వరం చికిత్సకు 'సింకోనా' చెట్టు బెరడు పని చేసి తీరును పరిశీలించారు. దీనిపై పూర్తి అవగాహన కోసం ఆ కషాయాన్ని స్వయంగా సేవించారు. దీంతో హానిమన్‌కు నాలుగు రోజుల్లో మలేరియా జ్వరం వచ్చింది. అదే బెరడు సూక్ష్మ పద్ధతిలో ఔషధంలా పని చేస్తోందని హానిమన్ గుర్తించారు. దీని ఆధారంగా 'ఒక పదార్థం ఏ బాధ కలిగిస్తుందో, ఆ బాధను నివారించడానికి అదే పదార్థాన్ని ఔషధంగా వాడాలి' అనే హోమియోపతి వైద్య విధానం మూలసూత్రాన్ని కనిపెట్టారు. అమెరికా, జర్మనీ వంటి దేశాల నుంచి అనేక మంది హోమియో వైద్యుల ద్వారా ఈ వైద్య విధానం మన దేశానికి వచ్చింది.

హోమియోకు ఆదరణ పెరిగింది



గతంలో హోమియో వైద్యం అంటే చాలా అపోహలుండేవి. అల్లోపతి వైద్యం వ్యాధి తీవ్రతను త్వరితగతిన తగ్గిస్తుందనే భావన ఉండేది. ప్రస్తుతం అది పూర్తిగా మారింది. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్‌లూ ఉండని హోమియో వైద్యంపై మక్కువ పెరిగింది. జిల్లాలో హోమియో ఆసుపత్రులు పెరగడమే దీనికి నిదర్శనం. గతంకన్నా హోమియో వైద్యం ఆధునికతను సంతరించుకుని ప్రజలకు మెరుగైన ఫలితాలు అందిస్తోంది.

– సలాది వెంకటస్వామి నాయుడు, అధ్యక్షుడు, ఏపీ హోమియోపతి డ్రగ్గిస్ట్ అసోసియేషన్

మొండి వ్యాధులకు సైతం..



ఎన్నో దీర్ఘకాలిక రోగాలతో పాటు మొండి వ్యాధులకు సైతం హోమియో వైద్యంలో మంచి ఫలితాలు వస్తున్నాయి. దీంతో దీనికి ప్రజల్లో ఆదరణ పెరిగింది. రాజమహేంద్రవరం హోమియో వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వాసుపత్రికి ప్రతి నిత్యం వచ్చే రోగుల సంఖ్య పెరిగింది.

– కేవీవీఎస్ సత్యకుమార్, ప్రిన్సిపాల్, అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియో వైద్య కళాశాల

తొలి పండగ.. మది మురియగ..

- ఘనంగా ఉగాది వేడుకలు
- కళకళలాడిన లోగిళ్లు
- వాడవాడలా పంచాగ పఠనాలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): తెలుగువారి తొలి పండగ ఉగాదిని జిల్లా ప్రజలు మంగళవారం ఆనందంగా జరుపుకొన్నారు. ప్రతి ఇంటా వేకువనే తలస్నానమాచరించి, షడ్రుచులతో తయారు చేసుకున్న ఉగాది పచ్చడి రుచి చూశారు. పూజలు చేశారు. ఆలయాలకు ఇష్ట దైవాలను దర్శించుకున్నారు. శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది సందర్భంగా పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎన్నికల సీజన్ కావడంతో ఆయా రాజకీయ పార్టీల కార్యాలయాలతో పాటు ప్రజాప్రతినిధులు, నేతలు తమతమ ఇళ్ల వద్ద పంచాగ పఠనం నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు జరిపించారు.

పండితులకు కలెక్టర్ సత్కారం

జిల్లా యంత్రాంగం ఆధ్వర్యాన వేద, ఆగమ పండితులను కలెక్టర్ కె.మాధవీలత సత్కరించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఉగాది వేడుకల్లో ఆమె మాట్లాడారు. ఏటా ఉగాది సందర్భంగా వేద, ఆగమ పండితులను సత్కరించుకోవడం సంప్రదాయంగా వస్తోందన్నారు. రానున్న ఎన్నికలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని కోరారు. వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా నిడదవోలు మండలం విజ్జేశ్వరంలోని శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి ఆలయ తంత్రసార ఆగమ పండితుడు అప్పలి వరాహ నరసింహారావుకు, గోపాలపురం శ్రీ వేంకటేశ్వర, శ్రీ సీతారామస్వామి ఆలయ అర్చకుడు, వైఖానస ఆగమ పండితుడు అగ్నిహోత్రం వెంకట సీతారామానుజాచార్యులుకు, రాజమహేంద్రవరం శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ అర్చకుడు, శైవాగమ పండితుడు చెరుకూరి భీమశంకరానికి రూ.10,116 చొప్పున నగదు పురస్కారాలు అందజేశారు. అలాగే, తాళ్లపూడి మండలం అన్నదేవరపేట శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయ అర్చకుడు, శైవాగమ పండితుడు రుద్రపాక శేషగిరిరావుకు ధవళేశ్వరం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు, వైఖానస ఆగమ పండితుడు పొన్నూరి అనంత సత్య వల్లభాచార్యులుకు; వడిశలేరు శ్రీ విశ్వేశ్వరస్వామి ఆలయ అర్చకుడు, శైవాగమ పండితుడు పూజ్యం శంభుప్రసాద్‌కు రూ.1,116 చొప్పున నగదు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయ, ధర్మదాయ అధికారి వి.సోమరాజు, వివిధ ఆలయాల ఈఓలు, దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అప్పలి వరాహ నరసింహారావును సత్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సత్యదేవుని ఖ్యాతి.. దశదిశలా వ్యాప్తి

- పంచాంగ పఠనంలో వేద పండితులు
- రత్నగిరిపై ఘనంగా ఉగాది వేడుకలు

అన్నవరం: శ్రీ క్రోధి నామ సంవత్సరంలో సత్యదేవుని ఖ్యాతి దశదిశలా వ్యాప్తి చెందుతుందని అన్నవరం దేవస్థానం వేద పండితుడు గొల్లపల్లి వేంకట్రామ సుబ్రహ్మణ్య ఘనపాఠి తెలిపారు. రత్నగిరిపై ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అనివేటి మండపం వద్దకు ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. నూతన సంవత్సర పంచాంగ ప్రతులను స్వామి, అమ్మవార్ల చెంత ఉంచి పండితులు పూజలు చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్ర మోహన్ నూతన వస్త్రాలు సమర్పించి, పంచాంగ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్య ఘనపాఠి నూతన సంవత్సర పంచాంగ ఫలితాలను చదివి వివరించారు. సత్యదేవునిది సింహ రాశి కావడంతో ఈ ఏడాది ఆదాయం 2, వ్యయం 14గా ఉందన్నారు. ఈ ఏడాది దేవస్థానంలో అనేక సత్రాలు, నిర్మాణాలు, వివిధ అభివృద్ధి పథకాలకు, భక్తుల సౌకర్యాలకు నిధులు వ్యయం చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ వేద పండితులు విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి (రాజమహేంద్రవరం), పంచాంగ కర్త పిడపర్తి భాస్కర సుబ్రహ్మణ్య ఘనపాఠి, టీటీడీ వేదపండిత సూపర్‌వైజర్ గుళ్లపల్లి చిన ఆంజనేయ ఘనపాఠి, దేవస్థానం విశ్రాంత వేద పండితులు గొర్తి విశ్వేశ్వర సుబ్రహ్మణ్య ఘనపాఠీ, విశ్రాంత ప్రధానార్చకుడు ఇంద్రగంటి గోపాలకృష్ణలను రూ.5,116 నగదు పారితోషికంతో చైర్మన్ రోహిత్, ఈఓ రామచంద్ర మోహన్ ఘనంగా సత్కరించారు. పంచాంగ ఫలితాలు వివరించిన సుబ్రహ్మణ్య ఘనపాఠిని కూడా సత్కరించారు. ఉగాది వేడుకల్లో భాగంగా ఆలయ ప్రాకారంలో స్వామివారి వెండి రథంపై రథోత్సవం ఘనంగా నిర్వహించారు.



గొల్లపల్లి ఘనపాఠిని సత్కరిస్తున్న చైర్మన్, ఈఓ

భిన్నత్వంలో ఏకత్వం.. పుదుచ్చేరి సొంతం

- వివిధ భాషలు, విభిన్న సంస్కృతుల కలయిక
- ఈ నెల 19న పుదుచ్చేరిలో ఏకైక లోక్‌సభకు ఎన్నిక

యానాం: పుదుచ్చేరి.. అక్కడ నివసించే ప్రజలంతా ఒకే కేంద్రపాలిత ప్రాంతానికి చెందినవారే అయినా ఒకరు తెలుగు మాట్లాడుతుంటే మరొకరు తమిళంలో దంచి కొడతారు. ఇంకొకరు మలయాళంలో సంభాషిస్తే ఆ పక్కనే ఫ్రెంచ్ భాష వినిపిస్తుంది. పండగల సంగతి సరేసరి.. కొందరు సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకుంటే మరికొందరు ఓనమ్‌ను వేడుకగా చేసుకుంటారు. మరోవైపు దశాబ్దాల క్రితమే వ్యాపారం కోసం వచ్చి స్థిరపడిన ఫ్రెంచ్ కుటుంబాలు ఇక్కడి సంస్కృతిలో మమేకమై కలిసి జీవిస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే వివిధ భాషలు, విభిన్న సంస్కృతుల కలయిక పుదుచ్చేరి సొంతం.. భిన్నత్వంలో ఏకత్వం అక్కడి ప్రజల తత్వం.. అందుకే దేశంలోని మిగిలిన కేంద్ర పాలిత ప్రాంతాలకు పుదుచ్చేరికి స్పష్టమైన వ్యత్యాసం కనిపిస్తుంది.

మూడు రాష్ట్రాల్లో విస్తరించిన లోక్‌సభ స్థానం

తమిళంలో పుదు–చ్చేరి అంటే కొత్త ఊరు అని అర్థం. 1674లో ఫ్రెంచ్‌వారు ఇక్కడ ఒక వాణిజ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశాక పాండిచ్చేరి అని పిలవడం మొదలుపెట్టారు. అయితే కేంద్ర ప్రభుత్వం మళ్లీ పాత పేరునే కొనసాగించాలని నిర్ణయించి అధికారికంగా పుదుచ్చేరిగా మార్చింది. భారతదేశంలోని ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాల్లో పుదుచ్చేరి ఒకటి. స్థానికంగా ఉండే వీధులు, ఇళ్లు ఫ్రెంచి నగరాలను తలపిస్తాయి. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి భౌగోళికంగా యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరిలతో కలిసి నాలుగు భాగాలుగా ఉంది. బంగాళాఖాతం తీరం వెంబడి ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో భౌగోళికంగా యానాం, అరేబియన్ సముద్ర తీరాన కేరళ సరిహద్దు వద్ద మాహే, తమిళనాడు సరిహద్దుల వద్ద కారైకల్, పుదుచ్చేరిలు ఉన్నాయి. ఒకప్పుడు 1723లో ఫ్రెంచివారు ఆక్రమించిన యానాంలో తెలుగు మాట్లాడుతుంటే, మాహేలో మలయాళం, పుదుచ్చేరి, కారైకల్‌లో తమిళం, అక్కడే స్థిరపడిన విదేశీయులైన ఫ్రెంచివారు ఫ్రెంచి భాషను మాట్లాడుతుంటారు. రాజధాని పుదుచ్చేరికి యానాం 811 కిలోమీటర్ల దూరంలో ఉంటే, కేరళ వద్ద నున్న మాహే 628 కిలోమీటర్ల దూరంలో ఉంది. 132 కిలోమీటర్ల దూరంలో కారైకల్ ఉంది. ఈ నాలుగు రీజియన్లలో మొత్తం 30 అసెంబ్లీ నియోజకవర్గాలు కలిపి పుదుచ్చేరి ఏకైక లోక్‌సభ స్థానంగా మారింది.

వేడెక్కిన రాజకీయ వాతావరణం

పుదుచ్చేరి ఏకైక లోక్‌సభ స్థానానికి ఈ నెల 19న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గంలో మొత్తంగా 10,23,699 మంది ఓటర్లున్నారు. వారిలో పురుషులు 4,80,069 మంది ఉండగా, మహిళలు 5,42,979 మంది, థర్డ్ జెండర్ 148 మంది ఉన్నారు. అందుకే పుదుచ్చేరి ఎంపీ స్థానంలో గెలుపెవరిదో నిర్దేశించేది కచ్చితంగా మహిళలేని ఘంటాపథంగా చెప్పొచ్చు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మొత్తంగా 26 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వారిలో ఏకంగా 19 మంది అభ్యర్థులు ఇండిపెండెంట్లు కావడం విశేషం. ఎంతమంది బరిలో నిలిచినా బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి తరపున పోటీ చేస్తున్న హోంమంత్రి నమశ్శివాయం, కాంగ్రెస్ తరపున బరిలో దిగుతున్న సిట్టింగ్ ఎంపీ వైథిలింగం మధ్యే ప్రధాన పోటీ ఉండనుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇద్దరు అభ్యర్థులూ సీనియర్ నేతలే కావడంతో తమ ప్రత్యర్థుల్ని చిత్తు చేసేందుకు గెలుపు వ్యూహాల్లో తలమునకలై ఉన్నారు. పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి 1967 నుంచి ఇప్పటి వరకూ 14 సార్లు ఎన్నికలు జరగగా దాంట్లో ఏకంగా 12 సార్లు కాంగ్రెస్ లేదా కాంగ్రెస్ కూటమి అభ్యర్థులే గెలుపొందడం విశేషం. రానున్న ఎన్నికల్లో పోటీచేయనున్న హోంమంత్రి నమశ్శివాయంకు యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మద్దతిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు.




ఫ్రెంచ్ నగరాలను తలపించేలా ఉన్న పుదుచ్చేరిలోని ఓ వీధి



ప్రఖ్యాత అరబిందో ఆశ్రమం



ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ కూటమి అభ్యర్థి నమశ్శివాయం



కాంగ్రెస్ అభ్యర్థి వి.వైథిలింగం

ఒకరు మాజీ సీఎం.. మరొకరు సీఎం మేనల్లుడు

ప్రస్తుతం సిట్టింగ్ ఎంపీగా ఉన్న 73 ఏళ్ల వైథిలింగం 1991 నుంచి 1996 వరకూ పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా పనిచేశారు. అనంతరం మళ్లీ 2008 నుంచి 2011 వరకూ సీఎంగా వ్యవహరించారు. అంతేకాదు ఎనిమిదిసార్లు ప్రజాప్రతినిధిగా సీనియర్ లెజిస్లేటర్‌గా ఆయనకు మంచి పేరుంది. 2016 నుంచి 2019 వరకూ స్పీకర్‌గానూ వ్యవహరించారు. 1980 నుంచి 2006 వరకూ నెట్టిపాకం ఎమ్మెల్యేగా గెలుస్తూ వచ్చారు. 2011–2016 వరకు కామరాజ్‌నగర్ ఎమ్మెల్యేగా ఉన్నారు. రెడియార్ సామాజికవర్గానికి చెందిన తెలుగు కుటుంబానికి చెందిన వారి పూర్వీకులు పుదుచ్చేరిలో స్థిరపడ్డారు. వారిది స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబం. అంతేకాదు వైథిలింగం తండ్రి వి.వెంకటసుబ్బ రెడియార్ పుదుచ్చేరికి రెండో సీఎంగా పనిచేశారు.

▸▸ ప్రస్తుతం పుదుచ్చేరి హోంమంత్రిగా ఉన్న 54 ఏళ్ల నమశ్శివాయం 2021 వరకూ పుదుచ్చేరి ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా ఉన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్నారనే కారణంతో ఆయనను పార్టీ సస్పెండ్ చేసింది. అనంతరం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి అదే ఏడాది బీజేపీలో చేరి మన్నాడిపేట నియోజకవర్గం నుంచి గెలిచారు. ఆయన సీఎం రంగసామికి స్వయానా మేనల్లుడు. 2011లో ఓల్గరేట్ నియోజకవర్గం, 2016 నుంచి 2021 వరకూ వెల్లునూర్ ఎమ్మెల్యేగా పనిచేశారు.

ఇంగ్లిష్ స్పీకింగ్‌లో ఉచిత శిక్షణ

మేధా ఇన్‌స్టిట్యూట్ ఫౌండర్ చిరంజీవి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్కారీ స్కూళ్లలో ప్రాథమిక విద్య నుంచీ ఇంగ్లిషు మీడియాన్ని అందుబాటులోకి తేవటం ప్రశంసనీయమని 'మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్' వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ డాక్టర్ ఎ.చిరంజీవి అభిప్రాయపడ్డారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా ఏ రంగంలోనైనా ఇంగ్లిష్‌పై పట్టున్న వారికే అవకాశాలు మెరుగ్గా ఉంటున్నాయని చెబుతూ.... ఆసక్తి ఉన్నవారి కోసం తమ సంస్థ ఉచితంగా ఇంగ్లిషు స్పీకింగ్ కోర్సును అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. 'మా ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేసి 30 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఈజీ ఇంగ్లిష్ కార్యక్రమాన్ని తలపెట్టాం. ఆన్‌లైన్లో ఉచితంగా అందజేస్తాం' అని చెప్పారాయన. ఈజీ ఇంగ్లిష్ ద్వారా స్పోకెన్ ఇంగ్లిష్ మాత్రమే కాకుండా దాదాపు 9 రకాల అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలియజేశారు. ఈ నెల రెండో వారం నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. 'ఈ కోర్సుకు ఆసక్తి ఉన్న ఎవరైనా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం పక్కన ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుంటే చాలు. వారి మొబైల్‌కు రిజిస్ట్రేషన్ లింకు వస్తుంది. లేనిపక్షంలో 9866006662 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపినా వారి మొబైల్ ఫోన్‌కు లింకును పంపిస్తాం' అని వివరించారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతుందని, ఆ తర్వాత తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు.

క్యూఆర్ కోడ్

అర్చకుడిగా పనిచేస్తానని చెప్పి

నగదు, నగలతో పరారీ

వాకాడ గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు



సీసీ ఫుటేజ్‌లో గుర్తించిన పరారైన అర్చకుడు చైతన్యకృష్ణ

కరప: శివాలయంలో అర్చకునిగా పనిచేస్తానని చెప్పి రూ.25 వేలు నగదు, ఆలయంలోని 25 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించుకు పోయిన ఘటన కరప మండలం వాకాడలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన కథనం మేరకు.... వాకాడలోని అన్నపూర్ణ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో పనిచేస్తున్న అర్చకుని వంతు మార్చినెల 31తో ముగిసింది. వేరే అర్చకుణ్ణి నియమించేందుకు వివిధ బ్రాహ్మణ సంఘాలతో గ్రామస్తులు సంప్రదించారు. కృష్ణచైతన్య అనే వ్యక్తి తనది కాకినాడని, దగ్గరలో ఏదైనా ఆలయంలో పనిచేద్దామనుకుంటున్నానని, 8328038233 మొబైల్ ద్వారా మాట్లాడాడు. మార్చి నెల 28న సాయంత్రం 6 గంటలకు వాకాడ వచ్చి జీతం మాట్లాడుకుని, అడ్వాన్స్‌గా రూ.5 వేలు తీసుకున్నాడు. తర్వాత వరసగా మూడురోజులు వచ్చి పాత పూజారితో మాట్లాడాడు. ఈ నెల ఒకటో తేదీన ఉదయం ఆలయానికి వచ్చి పాత అర్చకుని వద్ద నుంచి గుడికి సంబంధించిన సామగ్రి తీసుకున్నాడు. ఆలయంలో శుభ్రంచేసి, పూజాకార్యక్రమాలు నిర్వహించాడు. అదేరోజు సాయంత్రం వచ్చి ఇంటి సామగ్రి కోసం అని మరో రూ.20 వేలు అడ్వాన్స్‌గా తీసుకుని వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి రాకపోయేసరికి ఆలయంలో పరిశీలిస్తే 25 గ్రాముల బంగారు ఆభరణాలు కూడా కనిపించలేదు. దీంతో మంగళవారం రాత్రి వాకాడ గ్రామానికి చెందిన వెలుగుబంట్ల వీరవెంకట సత్యనారాయణ కరప పోలీసుస్టేషన్‌లో జరిగిన మోసంపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కరప ఎస్సై టి.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈవీఎంలపై అవగాహన

- ఎన్నికల నిర్వహణలో ఇవే కీలకం
- చెల్లని ఓట్లకు చెల్లు చీటీ
- ఓటింగ్‌లో కచ్చితత్వానికి వీవీ ప్యాట్

రాయవరం: సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం)లపై అధికార యంత్రాంగం అవగాహన కల్పిస్తోంది. ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తోంది. ఓటింగ్‌లో కచ్చితత్వానికి వినియోగిస్తున్న వీవీ ప్యాట్‌లు పనిచేసే విధానాన్ని అధికారులు వివరిస్తున్నారు. ఈవీఎంల అందుబాటులోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో చెల్లని ఓట్లకు చెక్ పడింది. భారీ ఎత్తున కాగితం వినియోగమూ తగ్గింది.

ఓటు కచ్చితత్వం

ఓటు కచ్చితత్వానికి వీవీ ప్యాట్ (ఓటరు వెరిఫైయేబుల్ పేపర్ ఆడిట్) వినియోగిస్తున్నారు. ఓటు వేయగానే ఒక స్లిప్పుపై సీరియల్ నంబర్, అభ్యర్థి పేరు, గుర్తు, ప్రింట్ అయి బాక్సులో పడుతుంది. 2000 సంవత్సరం నుంచి ఇప్పటివరకు జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలలో దాదాపుగా 350 కోట్ల వరకు ఓట్లు పోలైనట్టు అంచనా.

అలా మొదలైంది

బ్యాలెట్ బాక్స్ పేపర్ స్థానంలో ఈవీఎం తీసుకురావడానికి ఎన్నికల సంఘం 1977లో హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)ను సంప్రదించింది. దీంతో 1979లో నమూనా ఈవీఎంను రూపొందించగా, దీన్ని ఎన్నికల సంఘం 1980 ఆగస్టు 6న రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రదర్శించింది. ప్రభుత్వ రంగంలోని మరో సంస్థ బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్)తో కలిసి ఈసీఐఎల్ ఈవీఎంలను తయారు చేసింది.

వినియోగంలోకి వచ్చిందిలా..

1982లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఈవీఎంలను మొదటిసారి వినియోగించారు. కానీ వినియోగానికి సంబంధించి నిర్దిష్టమైన చట్టం లేకపోవడంతో ఆ ఎన్నికలను సుప్రీంకోర్టు కొట్టి వేసింది. దీంతో ఎన్నికల్లో ఈవీఎంలు వినియోగానికి సంబంధించి ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని పార్లమెంట్‌లో 1989లో సవరించారు. ఆ తర్వాత 1998లో మధ్యప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాల్లోని 25 శాసనసభ నియోజకవర్గాల్లో ఈవీఎంలను వినియోగించారు. 1999 ఎన్నికల్లో 45 పార్లమెంటరీ స్థానాల్లో, 2000లో హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో 45 అసెంబ్లీ స్థానాల్లో వినియోగించారు. 2001లో తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో అన్ని స్థానాల్లో ఈవీఎంలు ఉపయోగించారు. అప్పటి నుంచి ప్రతి ఎన్నికల్లో ఎన్నికల సంఘం ఈవీఎంలను ఉపయోగిస్తోంది. 2004లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో దేశంలోని అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఈవీఎంలు వినియోగించారు.



కంట్రోల్ యూనిట్‌తో కూడిన బ్యాలెటింగ్ యూనిట్

ఎప్పటికప్పుడు మార్పులు

ఈవీఎంలో కంట్రోల్ యూనిట్, బ్యాలెటింగ్ యూనిట్ ఉంటాయి. ఐదు మీటర్ల కేబుల్‌తో ఈ రెండింటిని అనుసంధానం చేస్తారు. 16 మంది అభ్యర్థుల పేర్లు, గుర్తులు ఉంటాయి 2006 కంటే ముందు ఎం1, ఆ తర్వాత ఎం2 ఈవీఎంలు ఉండగా.. నాలుగు బ్యాలెటింగ్ యూనిట్లను అనుసంధానం చేయడం ద్వారా గరిష్ఠంగా 64 మంది(నోటాతో కలిపి) అభ్యర్థుల బరిలో ఉన్నప్పటికీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. 2006 తర్వాత ఎం3 ఈవీఎంలను తయారు చేయగా 24 బ్యాలెటింగ్ యూనిట్లను అనుసంధానం చేయడం ద్వారా గరిష్ఠంగా నోటాతో కలిపి 384 మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ ఎన్నికలు నిర్వహించవచ్చు. వీటన్నింటికి ఒకే కంట్రోల్ యూనిట్ అవసరమవుతుంది.



వీవీ ప్యాట్

క్లుప్తంగా

కాలువలో పడి వ్యక్తి మృతి



శ్రీనివాసరావు మృతదేహం

అయినవిల్లి: బహిర్భూమికని వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తూ కాలువలో పడి మృతి చెందిన ఘటన మడుపల్లిలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి అయినవిల్లి ఎస్సై బి.రాజేష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అయినవిల్లి మండలం మడుపల్లి గ్రామానికి చెందిన కర్రేళ్ల శ్రీనివాసరావు(48) ఆదివారం రాత్రి బహిర్భూమికని వెళ్లి ప్రమాదవశాత్తూ కాలువలో పడి మృతి చెందాడు. అతని మృతదేహం వెలవలపల్లి-సిరిపల్లి పంటకాలువలలో లభ్యమైంది. మృతుడు సోదరుడు కర్రేళ్ల దుర్గాకేదరేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్‌కు ఆవు అడ్డు రావడంతో...

కాకినాడ రూరల్: మండలంలోని తూరంగి డ్రైవర్స్ కాలనీ వద్ద బైక్‌పై వెళుతున్న యు.కొత్తపల్లి మండలానికి చెందిన పెంట జయబాబు (35)కు ఆవు అడ్డురావడంతో దాన్ని ఢీకొని మృతి చెందాడు. ఇంద్రపాలెం పోలీసుల వివరాల ప్రకారం యానాంలో వివాహానికి హాజరైన జయబాబు తిరిగి వస్తుండగా సోమవారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. జయబాబు జగన్నాథపురం వద్ద డీసీసీబీలో సేల్స్ మేనేజరుగా పనిచేస్తున్నారు. ఇంద్రపాలెం ఏఎస్సై ఈశ్వరబాబు కేసు నమోదు చేశారు.

నేత్రపర్వం తలుపులమ్మ దర్శనం

లాంఛనంగా గర్భాలయంలో అమ్మవారి దర్శనాల పునరుద్ధరణ



విశేష అలంకరణలో తలుపులమ్మ

తుని రూరల్: లోవ దేవస్థానంలో స్వయంభూగా ప్రధాన గర్భాలయంలో వెలసిన తలుపులమ్మవారి దర్శనాలు నేత్రపర్వంగా పునఃప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం 7.22 గంటలకు అన్నవరం వీర వెంకట సత్యనారాయణస్వామి దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ ప్రధానాలయం ద్వారాన్ని తెరవగా వేదపండితులు, ప్రధాన అర్చకులు శాస్త్రోక్తంగా అమ్మవారి నేత్ర దర్శనం కార్యక్రమాన్ని నిర్వహించారు. 15 నెలలు తర్వాత ప్రధాన గర్భాలయంలో అమ్మవారిని భక్తులు దర్శించుకోవడం ఇదే ప్రథమం. రూ.15 కోట్లతో ఆలయం, మహామంటపం పునర్నిర్మాణం, తొమ్మిది అంతస్తుల రాజగోపురం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో 2023 జనవరిలో ప్రధాన ఆలయంలో అమ్మవారి దర్శనాలను నిలిపివేశారు. అప్పటి నుంచి మెట్లమార్గంలో అమ్మవారి పెద్ద విగ్రహం వద్ద బాలాలయం నిర్మించి భక్తులకు దర్శనాలు కల్పిస్తున్నారు. ఇటీవల ప్రధాన ఆలయ పునర్నిర్మాణం పూర్తికావడంతో లాంఛనంగా స్వయంభూగా వెలసిన అమ్మవారి దర్శనాలను లాంఛనంగా ప్రారంభించామని ఇన్‌చార్జి డీసీ, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకోవచ్చన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి నిత్యం దర్శనాలకు అనుమతిస్తామన్నారు. అదే రోజు అమ్మవారి పంచలోహ విగ్రహాలను ప్రతిష్ఠించి, కుంకుమ పూజలు నిర్వహిస్తామన్నారు. దర్శనాలు పునఃప్రారంభం సందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. అన్నవరం దేవస్థానం డీసీ రమేష్‌బాబు, తుని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీవీఎస్ మూర్తి దంపతులు, పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించి, పూజలు చేశారు.

మద్యం అక్రమ రవాణా కేసుల్లో ఏడుగురి అరెస్ట్

- తనిఖీల్లో రూ.1.96 లక్షల సీజ్
- మద్యం సీసాలు, సారా స్వాధీనం



పాత కోటలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లా పోలీసు శాఖ పలు టీమ్‌ల ద్వారా అక్రమ రవాణా అవుతున్న మద్యం, నగదులను పట్టుకుంటోంది. జిల్లాలో చెక్‌పోస్ట్‌లు, తదితర ప్రాంతాల్లో ఈ నిఘా బృందాలు సోమవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో అక్రమ మద్యం, నగదు, అరెస్ట్‌ల వివరాలను స్థానిక ఎస్పీ కార్యాలయం ఓ ప్రకటనలో వివరించింది. జిల్లా ఎస్పీ సునరావు శ్రీధర్ ఆదేశాల మేరకు ఈ దాడులు, తనిఖీలు జరుగుతున్నాయి. నరసాపురపుపేట చెక్ పోస్టు వద్ద రామచంద్రపురం పోలీసులు, ఎఫ్ఎస్‌టీ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో రూ.1,11,800 నగదు సీజ్ చేశారు. సఖినేటిపల్లి ఎఫ్ఎస్‌టీ అధికారులు రూ.84,505 నగదును స్వాధీనం చేసుకున్నారు. ద్రాక్షారామ పోలీసు స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 2 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. మండపేట పోలీసు స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.5,600 నగదు సీజ్ చేశారు. అమలాపురం, ముమ్మిడివరం, ఆలమూరు, రామచంద్రపురం, రాజోలు, కొత్తపేట పోలీసు స్టేషన్ల పరిధుల్లో ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 4 ఎన్‌డీపీ మద్యం సీసాలు, 10.02 లీటర్ల ఐఎంఎల్ మద్యం, 39 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 1,200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. మొత్తం ఏడు కేసులు నమోదు చేశారు. జొన్నాడ, గోపాలపురం, బొబ్బర్లంక, దిండి, ఎదుర్లంక, నరసాపురపుపేటల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లో నిరంతరాయంగా సోమ,మంగళవారాల్లో కూడా తనిఖీలు జరిగాయి. ఎన్నికల్లో ప్రజలకు భరోసా కల్పించేందుకు కేంద్ర బలగాలు కవాతు జిల్లాలో పలుచోట్ల మంగళవారం కూడా నిర్వహించారు. అమలాపురం తాలూకా పోలీసు స్టేషన్ పరిధిలో కామనగరువు, బీవీ రమణయ్య కాలనీ, విత్తనాలవారి కాల్వగట్టు, ప్రతాప్‌నగర్, మెండివారిపేట, పామర్రు పోలీసు స్టేషన్ పరిధిలో సమస్యాత్మక గ్రామమైన పాతకోటలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఆయా ప్రాంతాల పోలీసు అధికారులు స్థానిక ప్రజలతో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎన్నికల్లో ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవడం ఎలా అన్నది సూచించారు.

కోడి పందాలు ఆడుతున్న వ్యక్తుల అరెస్ట్

గండేపల్లి: కోడి పందేలు ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు మండలంలోని రామయ్యపాలెం శివారులో కోడి పందేలు ఆడుతున్నట్టు ముందస్తు సమాచారం మేరకు తన సిబ్బందితో వెళ్లి దాడి జరిపి ముగ్గురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. 2,050 నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు.

కొండెవరం శివారు మరో ముగ్గురు

కొత్తపల్లి: మండలంలోని కొండెవరం శివారు శొంఠివారిపాకల సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై స్వామినాయుడు తన సిబ్బందితో దాడి చేశారు. ముగ్గురు జూదగాళ్లను అరెస్టు చేసి ఒక కోడి, రూ.450 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఆంగ్లంలో ప్రావీణ్యానికి టోఫెల్



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న రీసోర్స్ పర్సన్



టోఫెల్ ఓఎంఆర్ షీట్

- నేడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పరీక్ష
- 12న ఉన్నత పాఠశాల విద్యార్థులకు
- జిల్లాలో 39 పాఠశాలల్లో నిర్వహణ

రాయవరం: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ఇంగ్లిషులో అనర్గళంగా మాట్లాడే విధంగా తర్ఫీదును ఇచ్చేందుకు ప్రభుత్వం టోఫెల్ (టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ యాజ్ ఏ ఫారిన్ లాంగ్వేజ్) కోర్సు ప్రవేశపెట్టింది. 2023–24 విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, ఉన్నత పాఠశాల విద్యార్థులకు వేర్వేరుగా రెండు రకాల కోర్సులను ప్రభుత్వ పాఠశాలల్లో బోధిస్తున్నారు. 3–5 తరగతులకు ప్రాథమిక, 6–9 తరగతులకు జూనియర్ పేరుతో ఏడాది పాటు టోఫెల్ విద్యపై శిక్షణ ఇచ్చారు.

రాష్ట్ర విద్యా పరిశోధన మండలి ఆధ్వర్యంలో..

రాష్ట్ర విద్యా పరిశోధన మండలి(ఎస్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో టోఫెల్ మెటీరియల్ పంపిణీ చేశారు. గతేడాది ఆగస్టు నెలలో ఈ కోర్సులను విద్యార్థులకు పరిచయం చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు ఉన్న చోట, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ కలిగి ఉన్న ఉన్నత పాఠశాలల్లో టోఫెల్ కోర్సును అమలు చేస్తున్నారు. రాష్ట్ర విద్యా పరిశోధన మండలి నేతృత్వంలో రాష్ట్ర స్థాయి అవగాహన కార్యక్రమాన్ని జిల్లా స్థాయి రీసోర్స్ పర్సన్లకు నిర్వహించగా, అనంతరం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అమెరికాలోని ప్రఖ్యాత ప్రిన్‌స్టన్ యూనివర్సిటీ పరిధిలోని ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ టోఫెల్ ప్రిపరేటరీ సర్టిఫికేషన్ పరీక్ష నిర్వహిస్తోంది. ఆ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ టెస్టింగ్ సర్వీసెస్ సర్టిఫికెట్ అందజేయనుంది. ఇప్పటివరకు విద్యార్థులు నేర్చుకున్న టోఫెల్ కోర్సు కు సంబంధించి బుధవారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, ఈ నెల 12న ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష నిర్వహించనున్నారు. ప్రాథమిక స్థాయిలో వినడం చదవడం నైపుణ్యాలు పరీక్షిస్తుండగా, జూనియర్ స్థాయి విద్యార్థులకు వినడం, చదవడంతో పాటుగా మాట్లాడే నైపుణ్యాలను పరీక్షిస్తారు. వినడం అనే ప్రక్రియలో విదేశీ యాసను ముఖ్యంగా అమెరికా యాసపై దృష్టి పెడుతున్నారు. ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నపత్రాలను సరఫరా చేస్తారు. ఓఎంఆర్ షీట్ సహాయంతో విద్యార్థులు జవాబులను రాస్తారు.

పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జిల్లా విద్యా శాఖాధికారిణి ఎం.కమలకుమారి నేతృత్వంలో శిక్షణ ఇచ్చారు. టోఫెల్ బోధనపై ఆంగ్ల ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు రామచంద్రపురం, రావులపాలెం, అమలాపురం, మండపేట, రాజోలులో డివిజన్ స్థాయి శిక్షణ శిబిరాలను నిర్వహించారు. జిల్లా రిసోర్స్ పర్సన్స్ ఒరిగెల జగపతి, ఆర్.వెంకటేశ్వరరావు శిక్షణ ఇచ్చారు. జిల్లాలో ఆంగ్ల బాషను బోధిస్తున్న 466 మంది ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ద్వారా ప్రయోజనం చేకూరింది. బుధవారం 192 ప్రాథమిక పాఠశాలల్లో 9,705 మంది టోఫెల్ పరీక్షలు రాయనున్నారు. ఈనెల 12న 307 ఉన్నత పాఠశాలల్లో 51,690 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి టోఫెల్ పాఠ్యపుస్తకాలను అందజేసేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది.

అంతర్వేదిలో ఉగాది వేడుకలు



అంతర్వేదిలో అర్చకుడు కిరణ్‌ను సన్మానిస్తున్న ఈఓ

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేది గ్రామములో వేంచేసి యున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో ఉగాది పండగను పురస్కరించుకొనిస్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ఆవరణలో పూల అలంకరణతో ఉగాది వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ ప్రధాన అర్చకులు పి. శ్రీనివాస కిరణ్, వేద పారాయణదార్ చింతా వెంకటశాస్త్రి , స్థానాచార్యులు వి.రామరంగాచార్యులు , అర్చక స్వాముల ఆధ్వర్యంలో ఉగాది ఆస్థానం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్థానాచార్యులు వి. రామరంగాచార్యులు పంచాంగ పఠనం నిర్వహించారు. విశేష సేవలు అందించిన ఆలయ సిబ్బందిని సన్మానించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

■ నిడదవోలు, గాంధీనగర్ లయన్స్ కంటి ఆసుపత్రి రోడ్ సూర్య రెసిడెన్సీ నందు డబుల్ బెడ్ రూం ఫ్లాట్స్ ఫస్ట్ ఫ్లోర్ మరియు సెకండ్ ఫ్లోర్ E/F అమ్మకంనకు కలవు. ఫోన్ : 94410 37735 [V- 2482]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

Wanted

■ రాజమండ్రి+తుణుకు, ప్రా॥ కం॥ ATM's స్టార్ హోటల్స్, షోరూమ్స్‌నందు సెక్యూరిటీ గార్డ్స్, సె॥ సూపర్ వైజర్స్ కావలెను. జీ॥ 12-15 వేలు. రూం+భో. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, RJY. ✆ : 93922 69369 [R-424]

■ హైదరాబాదులోని కుక్కగూడలో ఫామ్ హౌస్‌లో పనిచేయుటకు భార్య భర్త కావలెను. వ్యవసాయం తెలిసి ఉండాలి. మంచి జీతం రూము ఇస్తారు. Contact no. ✆ : 83096 63070 [R-6499]

■ ఉద్యోగాలు: 10th to డిగ్రీ చదివి పై చదువుల చదివే స్తోమత లేని నిరుద్యోగులకు కంపెనీలో ఉద్యోగాలు. Age: 28 సం॥లోపు ఉచిత శిక్షణలో నెలకు 9000 నుండి 12000, రూం ఫ్రీ. సంప్ర॥ VJA Ph: 9949654873. [WA-7508]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520,89197 39694. [M-1233961]

■ కస్టలైజ్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. Ph: 7995984445 [HA-21]

■ ప్రముఖ న్యూ బ్రాంచ్ ఆఫీస్‌లో వర్క్ చేయుటకు (స్మార్ట్ ఫోన్ అండ్ జూమ్ యాప్) గృహిణులు, రిటైర్డ్, నిరుద్యోగులు, చిరుద్యోగులు, స్టూడెంట్స్, టీం లీడర్స్ కావలెను. Age:20+P/F 30k-15k. 9030751352 [G-8814]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 91609 00024/ 96404 00073 [HA-16]

■ APSRTC నందు కాకినాడ, రాజమండ్రి, రాజోలు మరియు నరసాపురం డిపోల యందు పనిచేయుటకు AC Bus Attendents (Boys), HSD Oil Topup కావలెను. వయస్సు : 19 నుండి 50 సం॥లు. ఆకర్షణీయమైన జీతం మరియు PF, ESI కలదు. ✆ : 94937 85599, 81216 96346, 93812 13234 [R-06]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సీఆర్‌సీ సేవలు ఎనలేనివి



పోటీల ప్రారంభ కార్యక్రమంలో జ్యోతి వెలిగిస్తున్న సినీ దర్శకుడు వంశీ



అస్తికలు నాటికలో ఒక సన్నివేశం

- సినీ దర్శకుడు వంశీ
- ఉగాది ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం

రావులపాలెం: భారతీ సంస్కృతి సంప్రదాయాల్లో కళారంగానికి ఒక ప్రత్యేక స్థానం ఉందని అంతరించి పోతున్న కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు కాస్మోపాలిటన్ రిక్రియేషన్ క్లబ్(సీఆర్‌సీ) కాటన్ కళాపరిషత్ చేస్తున్న కృషి అభినందనీయం అని సినీ దర్శకుడు వంశీ అన్నారు. మంగళవారం రావులపాలెంలోని సీఆర్‌సీ కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో 24వ ఉగాది ఆహ్వాన నాటికల పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, సినీ దర్శకుడు వంశీ, సినీనటుడు కోట శంకరరావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం నాటిక పోటీలను వంశీ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు 24 వసంతాలుగా నాటికలను పరిచయం చేస్తూ వారిలో ఆలోచన రేకెత్తిస్తున్న సీఆర్‌సీ సేవలు ప్రశంసనీయం అని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా సీఆర్‌సీ కాటన్ కళాపురస్కారాన్ని పట్నాల పోతురాజుకి అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌సీ అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, సీఆర్‌సీ రూపశిల్పి విక్టరీ వెంకటరెడ్డి, నాటక కళాపరిషత్ డైరెక్టర్ కె.సూర్య, డైరెక్టర్లు సీహెచ్ గోపాలకృష్ణ, నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, పడాల సత్యనారాయణరెడ్డి, మల్లిడి ఆంజనేయరెడ్డి, చిర్ల కనికిరెడ్డి, పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన నాటికలు

ఉగాది ఆహ్వాన నాటికల పోటీల్లో భాగంగా మొదటిరోజు రెండు నాటికలను ప్రదర్శించారు. పెదకాకాని గంగోత్రి వారి ‘అస్తికలు’ నాటిక సందేశాత్మకంగా సాగింది. దర్శకుడు నాయుడు గోపి, రచన పిన్నమనేని మృత్యుంజయరావు, సంగీతం రమణ, మేకప్ పరమేష్ , రంగాలకరణ అనీల్ కుమారు నాటికను సందేశాత్మకంగా చెప్పిన తీరు ఆకట్టుకుంది. ఒంగోలు పండు క్రియేషన్స్ వారి ‘పక్కింటి మొగుడు’ నాటికను దర్శకుడు బాలినేని నాగేశ్వరరావు, రచన గోవిందరాజుల నాగేశ్వరరావు సంగీతం రమణ, రంగాలకరణ కమలాకర్ ప్రదర్శించిన తీరు హాస్యభరితంగా ఆకట్టుకుంది.